క్లుప్తంగా

కరాటే పోటీల్లో కోదాడ యువకుడి ప్రతిభ


క్రాంతికుమార్

కోదాడ : చెన్నై లోని ఎస్ఐవీఈటీ కళాశాలలో అక్టోబర్ 5న జాతీయ స్థాయిలో జరిగిన కరాటే వరల్డ్ రికార్డు అటెంప్ట్ పోటీల్లో కోదాడకు చెందిన యువకుడు ప్రతిభ చూపి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కోదాడ సమీపంలోని ఖానాపురానికి చెందిన క్రాంతికుమార్ మార్షల్ ఆర్ట్ (కరాటే)లో కొంత కాలంగా ప్రతిభ చూపుతున్నాడు. ఈ క్రమంలో చెన్నైలో జరిగిన పోటీలలో వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు పాల్గొన్నారని, ఆ పోటీలలో తాను ప్రతిభ చూపి పతకాన్ని కైవసం చేసుకున్నానని ఆయన తెలిపారు. కోదాడ ప్రాంతంలో విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తానని ఈ సందర్భంగా క్రాంతికుమార్ తెలిపారు.

నడిగూడెం వ్యవసాయ అధికారిగా మల్సూరు

నడిగూడెం : నడిగూడెం మండల వ్యవసాయ అధికారిగా గోలి మల్సూరు సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లాలో ఏఈఓగా పని చేస్తున్న మల్సూరు పదోన్నతిపై నడిగూడెం మండల వ్యవసాయ అధికారిగా వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన ఇంచార్జి మండల వ్యవసాయ అధికారి రాయపు దేవప్రసాద్ కోదాడ టెక్నికల్ ఏఓగా విధుల్లోకి వెళ్లారు. ఈ సందర్భంగా మల్సూరుకు ఏఈఓలు పిచ్చయ్య, ఉప్పయ్య, రేణుక, గాయత్రి సన్మానించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన అనంతరం గోపూజ జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని గోవిందపురంలో కరోనాతో చనిపోయిన వీసం మధు కుటుంబానికి ఆయన మిత్రులు సోమవారం రూ.70 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధు పిల్లల చదువు కోసం మిత్రుడు రేటోజు ఉమాకాంత్ రూ.50 వేలు, బోనాల అజయ్ రెడ్డి రూ.20 వేలు అందించారని, ఆ నగదును మధు భార్య సింధుకు అందించినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న మిత్రులను, వారి కుటుంబాలను ఆదుకునేందుకు తాము సంఘటితంగా కదులుతామని తెలిపారు. కార్యక్రమంలో మిత్రులు రామిశెట్టి శ్రీనివాస్, చిలకరాజు సతీష్, హాసన్, సాయికుమార్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ అజయ్‌కుమార్

మోతె : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోతె ఎస్ఐ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బుర్కచర్ల గ్రామంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు పరామర్శ

కోదాడరూరల్ : అనంతగిరి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కందికొండ శ్రీనివాస్ ఇటీవల విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఆయనను మున్నూరుకాపు పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో జేవీఆర్, గాలి శ్రీనివాస్, కొత్త లక్ష్మణ్ పటేల్, శనగల జగన్, శెట్టి విజయ్‌భాస్కర్, తోట శ్రీనివాస్, హన్మంతరావు, పిచ్చయ్య తదితరులు ఉన్నారు.

సుందరమ్మకు నివాళి

హుజూర్‌నగర్ : మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన రిటైర్డు ఏఎన్ఎం కనక సుందరమ్మ (83) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం ఆమె మృతదేహాన్ని పలువురు సందర్శించి పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గ్రామస్తులు, రిటైర్డు ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు ఉన్నారు.

ఎన్నికల వేళ.. అధికారుల కొరత

- ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ, సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీ
- పలు గ్రామాల్లో అందుబాటులో ఉండని ఇంచార్జి కార్యదర్శులు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బందులు ఎదురవుతాయంటున్న ప్రజలు
- భర్తీ చేయాలని వేడుకోలు


మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయం

మఠంపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల కొరత ఉంది. కీలకమైన వ్యవహారాలు పర్యవేక్షించే సూపరింటెండెంట్, మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిపాలనను పర్యవేక్షించే మండల పంచాయతీ అధికారులు బదిలీ కావడంతో ఈ పోస్టులు మూడు నెలలుగా ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా మండలంలోని గుర్రంబోడుతండా, చెన్నాయిపాలెం, కిందితండా, అవిరేణి కుంటతండా గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు లేరు. దీంతో ఇంచార్జిలను నియమించినా వారు సమయానుకూలంగా గ్రామాలకు వెళ్లకపోవడంతో పరిపాలన కుంటుపడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈ సమయంలో మండల పరిషత్‌లో కీలకమైన అధికారులు, గ్రామ పంచాయతీల్లో పర్మినెంట్ కార్యదర్శులు పూర్తిస్థాయిలో లేకపోతే ఎలా ఉంటూ నాయకులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులకు సందేహాలను నివృత్తి చేసే అధికారులు అందుబాటులో ఉండేలా పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు. మఠంపల్లి మండలంలో 29 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, 13 ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కావున ఉన్నతాధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులను, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను పూర్తిస్థాయిలో నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులను నియమించాలి



త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయానికి వెళితే సందేహాలను నివృత్తి చేసే నాథుడే కరువయ్యారు. వెంటనే ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులను భర్తీ చేయాలి.

– జాల కిరణ్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్, మఠంపల్లి

ఎన్నికల్లో ఇబ్బంది పడాల్సి వస్తుంది



గ్రామ పంచాయతీలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి కనుక ఇంచార్జి కార్యదర్శులు అందుబాటులో ఉండక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇంటి పన్ను రశీదులు, నోడ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అందువలన ప్రతి గ్రామానికి పర్మినెంట్ కార్యదర్శుల నియామకం చేపట్టాలి.

– బాలునాయక్, సేవాలాల్ సేన జిల్లా నాయకుడు, లాలితండా

అధికారులు లేకపోతే ఎన్నికల నిర్వహణ ఎలా ?



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మండల పరిషత్ కార్యాలయమే కీలకం. అలాంటి కార్యాలయంలో సూపరింటెండెంట్, ఎంపీఓతో పాటు గ్రామాలకు కార్యదర్శులు లేకపోతే ఎన్నికలు ఎలా జరుగుతాయి. కావున వెంటనే పోస్టులు భర్తీ చేసి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.

– మాలోతు బాలునాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు, చెన్నాయిపాలెం

శునకానికి రక్త మార్పిడి

- ప్రాణాపాయ స్థితిలో ఉన్న కుక్కను కాపాడిన డాక్టర్ పెంటయ్య


కుక్కపిల్లకు రక్తమార్పిడి చేస్తున్న డాక్టర్ పెంటయ్య, సిబ్బంది

కోదాడరూరల్ : ప్రాణపాయ స్థితిలో ఉన్న కుక్కకు రక్త మార్పిడి చేసి దాని ప్రాణాలు కాపాడారు కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య. వివరాలలోకి వెళితే కోదాడ మండల పరిధిలోని గుడిబండకు చెందిన ఇర్ల నర్సింహారెడ్డి కుక్కపిల్లకు 40 రోజులకు వేయాల్సిన వ్యాధినిరోధక టీకాను వేయించలేదు. దీంతో అది వాంతులు, విరోచనాల బారిన పడి ఆహారం తీసుకోక బక్కచిక్కి పోయింది. దానిని యజమాని కోదాడ పశువైద్యశాలకు తీసుకురాగ పరీక్షించిన డాక్టర్ పెంటయ్య రక్తవిరోచనాలతో పాటు రక్తహీనత, డీహైడ్రెషన్‌కు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. రక్తం ఎక్కిస్తే బతికే అవకాశం ఉందని తెలుసుకొని రక్తం ఎక్కించాలని నిర్ణయించుకున్నాడు. కానీ జిల్లాలో ఇది వరకు ఇలాంటి చికిత్స చేయకపోవడంతో రక్త మార్పిడికి సంబంధించిన పరికరాలు, బ్యాగ్స్ అందుబాటులో లేవు. దీంతో డాక్టర్ రక్త పరీక్ష కేంద్రాల్లో ఉపయోగించే గొట్టాలను తెప్పించి ఆరోగ్యంగా ఉన్న రెండు కుక్కల రక్తాన్ని సేకరించారు. ఆ రక్తం గడ్డకుండా యాంటికో ఆగ్‌లెంట్ గొట్టాలలోకి తీసుకొని సెలైన్ సీసాలలో లోడ్ చేసి కుక్క పిల్లకు ఎక్కించి దాని ప్రాణాలు కాపాడారు. చికిత్స అనంతరం కుక్కపిల్ల కోలుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సిబ్బంది చంద్రకళ, అఖిల్, సాగర్ ఉన్నారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్వప్న

చిలుకూరు: ఎన్నికల ప్రవర్తనా నియామావళిని పకడ్బందీగా అమలు చేయాలని జెడ్పీటీసీ ఎన్నికల చిలుకూరు మండల రిటర్నింగ్ అధికారి స్వప్న అన్నారు. సోమవారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల కోడ్‌పై గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి గ్రామాల సమాచారం ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఎస్ఐ సురేష్‌రెడ్డి, ఏఓ శ్రీధర్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ప్రభుత్వ కార్యాలయ పరిసరాలు


తహసీల్దార్ కార్యాలయంలో రెయిన్ గేజ్ చుట్టూ పెరిగిన పిచ్చి చెట్లు


మండల పరిషత్ కార్యాలయం పక్కన ఇలా..

చిలుకూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు చెత్తా చెదారంతో దర్శనమిస్తున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెంది కుడుతుండడంతో చేతులు, కాళ్లు వాచి ఇబ్బంది పడుతున్నామని కార్యాలయానికి వచ్చే వారు అంటున్నారు. చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వర్షపాత నమోదు కేంద్రం (రెయిన్ గేజ్) చుట్టూ పిచ్చి చెట్లు పెరిగాయి. అలాగే తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయానికి మధ్యలో ఉన్న ఖాళీ ప్రదేశంలో చెట్లు పెరిగాయి. నరికివేసిన చెట్ల కొమ్మలను కూడా అక్కడే పడివేవేయంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కార్యాలయాల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- భర్త, అత్తమామపై కేసు నమోదు

నడిగూడెం : అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్తతో పాటు, అత్త, మామపై కేసు నడిగూడెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్ఐ గందమళ్ల అజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామానికి చెందిన గుర్రం వెంకటరెడ్డి, ప్రమీల దంపతుల పెద్ద కూతురు లావణ్యతో ఆత్మకూరు (ఎస్) మండలం కోటపహాడ్‌కు చెందిన కందాల రేణుక, లింగారెడ్డిల కుమారుడు రాజశేఖర్‌రెడ్డితో 2023 మేలో పెళ్లి జరిగింది. అప్పటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని లావణ్యను తన భర్త రాజశేఖర్ రెడ్డి, అత్త రేణుక, మామ లింగారెడ్డిలు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

కోదాడరూరల్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని పార్టీకి పుర్వవైభవం తీసుకొద్దామని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సంపెట ఉపేందర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులను ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించాలని సూచించారు.

ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని వినతి


డీపీఓకు వినతిపత్రం ఇస్తున్న యువకులు

కోదాడ : కోదాడ మండల పరిధిలోని గుడిబండ గ్రామ పంచాయతీలో గల 12వ వార్డులో ఎస్టీలు అధికంగా ఉన్నామని, గడిచిన 40 సంవత్సరాల్లో తమ వార్డు ఏనాడు ఎస్టీ రిజర్వేషన్ రాలేదని కావున 12వ వార్డును తమకు రిజర్వు చేయాలని ఆ వార్డుకు చెందిన పలువురు సోమవారం జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో వార్డు స్థానం తమకు రిజర్వు చేయకపోవడంతో రాజకీయ అవకాశాలను కోల్పోతున్నామని, అధికారులు రిజర్వేషన్‌ను పునపరిశీలించాలని వారు వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గోపి, రాజేష్, ప్రభుదేవ, కార్తిక్ తదితరులు ఉన్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నడిగూడెం : ప్రేమ పేరుతో యువతిని వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం నడిగూడెం ఎస్ఐ గందమళ్ల అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వట్టె మౌనిక అనే యువతిని నడిగూడెంకు చెందిన శ్రీరాములు సంతోష్ గత కొద్ది రోజులుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలి

నడిగూడెం : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఆ పార్టీ రత్నవరం గ్రామ శాఖ అధ్యక్షుడు పోలంపల్లి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు కాకపోవడంతో పాటు, గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఆ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

నడిగూడెం : సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని తహసీల్దార్ బూసిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం నడిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం వారోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, సమాచార హక్కు వికాస సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూరు శివ, కార్యదర్శి కిన్నెర ఉపేందర్, నాయకులు నోములు బుచ్చయ్య, నోసిన కోటయ్య, నెమ్మాది పున్నయ్య, అల్లె ఆనంద్, పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీఆర్‌కు నివాళి

చివ్వెంల : మాజీ మంత్రి, సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ సోమవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులకు గైర్హాజరు అయ్యారు. అనంతరం బార్ అసోసియేషన్ హాల్‌లో ఆర్డీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, న్యాయవాదులు నూకల సుదర్శన్ రెడ్డి, వీవీరావు, బాణాల విజయ్ కుమార్, రఘుపతిరెడ్డి, బత్తిని వెంకటేశ్వర్లు, టేకుల పల్లి శ్రీనివాస్‌రావు, మోదుగు వెంకట్ రెడ్డి, ఎండీ.ఫరిదోద్దిన్, మారపాక వెంకన్న, సోమేశ్వర్‌రావు, నారాయణ, ఏడిండ అశోక్, తాళ్లపల్లి సత్యనారాయణ, కారింగుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని 22వ వార్డు జమున నగర్ శ్మశానవాటికలో వసతులు కల్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో 22వ వార్డు కార్యదర్శి పెంద్ర కృష్ణ, మైనార్టీ జిల్లా నాయకుడు ఎండీ పాషా, మహిళా సంఘం నాయకురాలు దేశగాని హేమలత, పెంద్ర చిన్న, గూడేలి శివ, పెంద్ర ప్రమోద్ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర


గంపలు ఎత్తుకొని ఆలయానికి వెళ్తున్న యాదవులు

గరిడేపల్లి : మండల కేంద్రంలో యాదవులు సోమవారం గంగమ్మ జాతరను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు గంపలను ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి యాటపోతులు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. జాతరలో భాగంగా పురాతన గంగమ్మ దేవాలయాన్ని యాదవులు గ్రామస్తుల సహకారంతో ఆధునీకరించి ప్రత్యేక పూజలు, ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యాదవులు, పూజారులు, మహిళలు పాల్గొన్నారు.

వడ్డెర ఓబన్న ఆశయాలు సాధిద్దాం


ఓబన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న వడ్డెర కులస్తులు

కోదాడరూరల్ : స్వాతంత్ర్య పోరాట యోధుడు వడ్డెర ఓబన్న ఆశయాలు సాధిద్దామని పలువురు వడ్డెర సంఘం నాయకులు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో వడ్డెర ఓబన్న వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాల్లో పుట్టిన ఓబన్న భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారిపై అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వంటిపులి వెంకటేష్, బత్తుల ఉపేందర్, చింతల నాగేశ్వరరావు, చింతల లింగయ్య, వంటిపులి శ్రీనివాస్, ఓర్సు దుర్గారావు, ఉప్పతల కోటేశ్వరరావు, బండ్ల దాసు తదితరులు ఉన్నారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

నడిగూడెం : మండలంలోని వల్లాపురం రెవెన్యూ పరిధిలో గల శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ఏకవార రుద్రాభిషేకం జరిపారు. వాహన పూజలు నిర్వహించారు. అనంతరం చనుపల్లికి చెందిన సోమిరెడ్డి మల్లారెడ్డి, అమరబోయిన నాగరాజు, జక్కపల్లికి చెందిన పగడాల రామకృష్ణారెడ్డిల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, ఆలయ పూజారి సంగమేశ్వర ప్రసాద్, సభ్యులు కొత్తా కృష్ణారెడ్డి, బజ్జూరి అచ్చిరెడ్డి, నూకపంగు వెంకన్న, తీగూరి నారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా బీక్యాతండా రోడ్డు


గుంతలమయంగా బీక్యాతండా - మోతె రోడ్డు

మోతె : మండలంలోని బీక్యాతండా నుంచి మోతె మండల కేంద్రానికి వెళ్లే మెటల్ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో నిత్యం తండా నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే తండావాసులు నరక యాతన పడుతున్నారు. రోడ్డు వెంట పొలాలు ఉన్న రైతులు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించి బీటీ రోడ్డు మంజూరు చేయాలని తండావాసులు కోరుతున్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

సూర్యాపేట టౌన్ : 2024–25 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ ఆర్.ప్రకాష్ రెడ్డి సోమవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఎస్.సాయి సృజన, బి.ప్రణవి, జి.శ్రీజ, పి.హర్షిత, వై.ప్రజ్ఞ, వై.శిశిర, ఎన్.సుదీప, ఎస్.సాయి గోకుల్, కాశ్యాప్ రామ్‌లకు నగదు చెక్కులు అందజేసి అభినందించారు. అనంతరం పాఠశాల కరస్పాండెట్ ఆర్.ప్రకాష్ రెడ్డి మాట్లాడారు. పూర్వ విద్యార్థులు, రోళ్లకంటి లక్ష్మీరాంరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రతిభా పురస్కారాలు ప్రతి ఏటా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నగదు ప్రోత్సాహకం అందుకున్న విద్యార్థులు

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం


వల్లాపురం వద్ద గల పిరమిడ్ కేంద్రంలో ధ్యానం చేస్తున్న స్థానికులు

నడిగూడెం : ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ ధ్యాన నిపుణుడు కొండా ఉపేందర్ అన్నారు. సోమవారం పౌర్ణమి సందర్భంగా మండలంలోని వల్లాపురంలో గల శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న పిరమిడ్ కేంద్రంలో ధ్యానంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా జీవన శైలిలో మార్పులు రావడంతో మానసిక ఒత్తిళ్లతో పాటు జబ్బులపాలవుతున్నామన్నారు. కావున ప్రతిఒక్కరూ నిత్యం శ్వాసమీద ధ్యాస పెట్టి ధ్యానం చేస్తే ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మోహన్‌రెడ్డి, ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, బజ్జూరి అచ్చిరెడ్డి, తీగూరి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు


నడిగూడెం నుంచి చాకిరాలకు వెళ్లే రహదారి వెంట ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


నడిగూడెం సమీపాన సాగర్ ఎడమ కాల్వ కట్టపై ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- చుట్టూ రక్షణ కవచాలు కరువు
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు

నడిగూడెం : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచాలు లేవు. దీంతో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రధానంగా నడిగూడెం మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరం ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ఎస్సీ కాలనీ, రామాపురంలోని ప్రధాన రహదారి వెంట ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, బృందావనపురంలోని ఎస్సీ కాలనీ, వల్లాపురం, నారాయణపురం, సిరిపురం, శ్రీరంగాపురం, రత్నవరం, ఎకలాస్‌ఖాన్‌పేట తదితర గ్రామాల్లో ఇళ్ల మధ్యనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. దీంతో వర్షం కురిసినప్పుడు, పిడుగులు పడినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల వెంట నివాసాలు ఉన్న ప్రజలు భాయందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ కూడా వస్తున్నదని అంటున్నారు. సాగర్ ఎడమ కాల్వ కట్టపై నడిగూడెం, రామాపురం, చాకిరాల, సిరిపురం, నారాయణపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల పరిధిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా ఎలాంటి రక్షణ కవచాలు లేకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బలవుతున్న మూగ జీవాలు..

నడిగూడెం మండల కేంద్రంతో పాటు వేణుగోపాలపురం, చాకిరాల, వల్లాపురం, బృందావనపురం, శ్రీరంగాపురం, రత్నవరం, తెల్లబెల్లి, వల్లాపురం తదితర గ్రామాల్లో వ్యవసాయ బావులు, బోర్లకు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎలాంటి రక్షణ కవచాలు లేవు. దీంతో గత ఏడాది కాలంలో విద్యుదాఘాతానికి గురై దాదాపు 30కి పైగా పాడి గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయని రైతులు చెబుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని అనేక సార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందన కరువైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రక్షణ కవచాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలి



మా గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు గ్రామంలోని పలువురి వ్యవసాయ బావులు, డొంకల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. కావున ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలి.

– పచ్చిగోళ్ల శ్రీను, చెన్నకేశ్వాపురం

అధికారులు స్పందించాలి



నడిగూడెం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల వెంట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచాలు లేక ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా నడిగూడెం సాయి మందిరం ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, చాకిరాలకు వెళ్లే రహదారి వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– కన్నెబోయిన మురళి, నడిగూడెం